సాక్షి గుంటూరు

ఆదివారం । 27 । జూలై । 2025



31న కృష్ణానదికి మహావస్త్ర సమర్పణ

నాగాయలంక: కృష్ణానదికి ఈనెల 31న మహా వస్త్ర సమర్పణ వేడుక నిర్వహిస్తున్నట్లు నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.



గోవింద నామ పారాయణం

తెనాలిటౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు శనివారం గోవిందనామం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

గుండిపార్వతి అమ్మవారికి విశేష పూజలు



భట్టిప్రోలు: గ్రామ హిందూ శ్మశానవాటికలో కొలువైన గుండిపార్వతి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కార్తికేయశర్మ పూజలు జరిపారు.

న్యూస్‌రీల్

'పాస్‌పోర్ట్' విచారణ సేవల్లో జిల్లాకు ద్వితీయ స్థానం



నగరంపాలెం: పాస్‌పోర్ట్ దరఖాస్తుల విచారణ సేవల్లో రాష్ట్రంలో గుంటూరు జిల్లా పోలీస్ శాఖకు ద్వితీయ స్థానం లభించడం ఆనందంగా ఉందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో శనివారం ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష నుంచి అవార్డును జిల్లా స్పెషల్ విభాగం (ఎస్‌బి) సీఐ అలహరి శ్రీనివాస్ స్వీకరించారు. అనంతరం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను జిల్లా ఎస్పీ అభినందించారు. గతేడాది జూలై నుంచి ఈ ఏడాది జూన్ వరకు 30 వేలకుపైగా పాస్‌పోర్ట్ దరఖాస్తులను విచారణ పూర్తి చేయడంపై రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం లభించింది.

చెస్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాలకు బహుమతి




గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్‌లోని 17 మెడికల్ కళాశాలలతో జూలై 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఇంటర్ మెడిక్స్ చెస్ పోటీల్లో గుంటూరు మెడికల్ కళాశాల విద్యార్థులు మూడో బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి విజేతలను అభినందించారు. ఇంటర్న్ డాక్టర్ ఆశాదేవి, ఎంబీబీఎస్ విద్యార్థినులు సమదర్శిని, రిస్సీ దీపికలకు డాక్టర్ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులు చురుకుగా పాల్గొనడం అభినందనీయం అన్నారు. ఇది సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 1516 క్యూసెక్కులు శనివారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లె కాలువకు 126 క్యూసెక్కులు, తూర్పు కాలువకు 262, పశ్చిమ కాలువకు 120, నిజాపట్నం కాలువకు 235, కొమ్మూరు కాలువకు 110 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బ్యారేజి నుంచి సముద్రంలోకి 10,650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

581 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 581.30 అడుగులకు చేరింది. ఇది 286.7635 టీఎంసీలకు సమానం. జలాశయం నుంచి కుడి కాలువకు 511, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి జలాశయానికి 1,20,339 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

రూ.2.75 కోట్ల విలువైన 20 పనులకు పొడా ఆమోదం



నరసరావుపేట: పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రూ.2.75 కోట్లతో చేసే 20 పనులకు పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ (పొడా) ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శనివారం కలెక్టరేట్‌లో పొడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధ్యక్షతన అభివృద్ధి, ప్రణాళికా కార్యకలాపాలపై అథారిటీ నాలుగవ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు అజెండాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనిలో అథారిటీ సభ్యులు డీటీసీపీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సునీత, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ టి.రవీంద్రబాబు, ఏపీ సీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రాంబాబు, జిల్లా పర్యాటక అధికారి నాయుడమ్మ, కాలుష్య నియంత్రణ మండలి విభాగ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పారిశ్రామిక కేంద్ర కార్యదర్శి ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు నరకానికి నకళ్లుగా మారిపోయాయి. మౌలిక సదుపాయలు మచ్చుకైనా లేవు. విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, నోట్‌బుక్స్ ఇంత వరకు అందలేదు. కొన్నిచోట్ల టాయిలెట్లు అధ్వానంగా ఉన్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం దృష్టి సారించలేదు. అన్ని చోట్ల మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రపరిచేందుకు సిబ్బంది కూడా లేరు. జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు 34, ఎస్టీ విద్యార్థులకు 4 , బీసీ విద్యార్థులకు 29 వసతిగృహాలు ఉన్నాయి. అన్ని చోట్లా ఇదే దుస్థితి నెలకొంది.

నరకానికి నకళ్లు!



నగరంపాలెంలోని ఎస్టీ వసతి గృహంలో సెల్‌ఫోన్ కాంతిలో విద్యార్థుల భోజనం

జిల్లాలో హాస్టళ్ల వివరాలివీ..

హాస్టల్ రకం	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ ప్రీ మెట్రిక్	18	1,001
ఎస్సీ పోస్టు మెట్రిక్	16	1,289
ఎస్టీ ప్రీ మెట్రిక్	01	155
ఎస్టీ పోస్ట్ మెట్రిక్	03	193
బీసీ ప్రీ మెట్రిక్	13	859
బీసీ పోస్ట్ మెట్రిక్	16	824
మొత్తం	67	4,321

- ప్రభుత్వ వసతిగృహాల్లో కనీస వసతులు కూడా కరువే
- హైకోర్ట్ హెచ్చరించినా పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సౌకర్యాలు లేక నిత్యం విద్యార్థులకు తప్పని కష్టాలు
- కటిక నేలపైనే నిద్రించాల్సిన దీనావస్థలో విద్యార్థులు
- పర్యవేక్షణ గాలికి వదిలేసిన అధికార యంత్రాంగం

కూటమి పాలనలో హాస్టల్ విద్యార్థులకు అష్టకష్టాలు



గుంటూరు లాడ్జి సెంటర్‌లోని బీసీ వసతి గృహంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను గాలికొదిలేసింది. గ్రామాల్లోని పేద విద్యార్థులు ఈ ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ గుంటూరు నగరంలోని, మండలం కేంద్రంలోని ఆయా కళాశాలలకు, పాఠశాలలకు వెళుతుంటారు. వీరికి కనీస వసతులు కూడా లేక హాస్టళ్లలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నగరంలోని ఎస్సీ వెల్ఫేర్ హాస్టళ్లకు గత సంవత్సరం జూన్ నుంచి డైట్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వార్డెన్లు అప్పులు తెచ్చి వండించాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టళ్లు తెరిచి నెల దాటినా విద్యార్థులకు దుప్పట్లు, గ్లాసులు, ప్లేట్లు తదితరాలు ఇవ్వలేదు. కొన్ని చోట్ల టాయిలెట్ల తలుపులు కూడా ఊడిపోయాయి. కాస్మోటిక్ చార్జీలు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. సబ్బులు, షాంపులు, పేస్ట్ వంటివి కొనలేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నాణ్యమైన ఆహారం అందించలేని స్థితిలో పాలకులు ఉన్నారు. నీళ్ల సాంబారు, సంగటిలా మారిన అన్నమే విద్యార్థులకు దిక్కు అవుతోంది. చాలాచోట్ల మెనూ ప్రకారం డైట్ పెట్టడం లేదు.

ప్రత్తిపాడులో

ప్రత్తిపాడు పరిధి వట్టిచెరుకూరు బీసీ హాస్టల్‌లో తాగునీరు లేక విద్యార్థులే స్వయంగా వాటర్ క్యానులను మోసుకుంటూ తెచ్చుకుంటున్న దుస్థితి నెలకొంది. పొన్నూరులోని పలు హాస్టళ్లలో కుళ్లి పోయిన కూరగాయలతో వంట చేస్తున్నారు. ఇటీవల ముగ్గురు విద్యార్థినులు అస్వస్థత గురయ్యారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. పొన్నూరు ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ మూలనపడింది.



పనిచేయని ఆర్వో ప్లాంట్



వాటర్ క్యాను మోసుకొస్తున్న దృశ్యం

మంగళగిరిలో

మంగళగిరి పరిధిలోని కొప్పురావు కాలనీ వద్ద ఎస్సీ బాలుర హాస్టల్‌లో 15 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లు అధ్వానం ఉన్నాయి. వాటిని శుభ్రం చేసే వారే కరువయ్యారు.



అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్డి

మంగళగిరి పరిధిలోని ఇందిరానగర్‌లో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్‌లో స్కూల్, కళాశాలల విద్యార్థులు ఉంటున్నారు. గతంలో ఇక్కడ శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పడేసి కొత్త హాస్టల్ నిర్మించడానికి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఆ హాస్టల్ ఎదురుగానే ఉన్న ఓ ప్రభుత్వ భవనంలోకి వీరందరినీ తరలించారు. పాఠశాల విద్యార్థులు 78 మంది ఉండగా వారికి మూడు గదులు కేటాయించారు. అవి సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా బాత్‌రూములు లేవు. సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు.



పునాదుల దశలో నిర్మాణంలో ఉన్న ఎస్సీ బాలికల హాస్టల్ భవనం

తాడికొండలో

తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో చిన్నపాటి వర్షానికి ఆవరణం చెరువును తలపిస్తోంది. మంచాలు లేక 300 మందికి పైగా విద్యార్థులు ఇంటి నుంచి దుప్పట్లు తెచ్చుకుని నేలపై నిద్రిస్తున్నారు.



మోకాల్లోతు నీటిలో తాడికొండ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఆవరణ

తెనాలిలో

తెనాలి మారిస్‌పేట ఆర్‌ఆర్ నగర్‌లో రెండు ఎస్సీ బాలికల వసతి గృహాలు, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల పల్లపు ప్రాంతంలో ఉన్నాయి. గతేడాది ఆగస్ట్ నెలలో కురిసిన భారీ వర్షాలకు ఇవి నీట మునిగాయి. ప్రిన్సిపల్ గది, స్టాఫ్ రూమ్‌లలోని ఫైళ్లు తడిసి ముద్దయ్యాయి. విద్యార్థినులను సీఎం కాలనీలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలోని పై అంతస్థులో, మిగిలిన ఎస్సీ బాలికల వసతి గృహాల విద్యార్థినులను మారిస్‌పేట ఎస్‌సీఆర్ మున్సిపల్ హైస్కూలులో ఉండేలా ఏర్పాట్లు చేశారు.



శిథిలావస్థకు చేరుకున్న బాలికల వసతి గృహ భవనం

పెండింగ్ కేసుల్లో అరెస్ట్‌లు త్వరితగతిన చేయాలి

నగరంపాలెం: పెండింగ్ కేసుల్లో అరెస్ట్‌లను త్వరితగతిన చేయాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శనివారం అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కేసుల విచారణలో పోలీసుల చర్యలు వేగవంతంగా ఉండాలని తెలిపారు. తద్వారా న్యాయస్థానాల్లో నిందితులకు శిక్షలు ఖరారవుతాయని అన్నారు. ఎప్పటికప్పుడు కేసులకు సంబంధించి సమాచారం సీసీటీఎన్‌ఎస్‌లో నమోదు చేయాలన్నారు. గడువులోగా చార్జిషీట్లను కోర్టుల్లో దాఖలు చేయాలని చెప్పారు. జిల్లాలో 170 మంది రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. వారిలో పీడీ యాక్ట్ పెట్టాల్సిన వారిని గుర్తించి చర్యలు చేపట్టాలని అన్నారు. డ్రోన్ల సాయంతో నగర, శివారు ప్రాంతాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, ముళ్ల పొదలపై నిఘా ఉంచాలన్నారు. తద్వారా అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలని చెప్పారు. విధుల్లో పోలీస్ అధికార, సిబ్బంది విధిగా బాడీ వార్న్ కెమెరాలు ధరించాలని స్పష్టం చేశారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ బర్కత్ అలీ మాట్లాడుతూ పోక్సో, ఇతర కేసుల్లో చార్జిషీట్లల్లో తప్పులు దొర్లకుండా దాఖలు చేయాలని అన్నారు. న్యాయ సలహాలకై తమను సంప్రదించాలని చెప్పారు. న్యాయస్థానాల్లో బాధితులకు న్యాయం అందించేందుకు పోలీస్, న్యాయశాఖ ఐక్యంగా పనిచేయాలన్నారు. నిందితులకు శిక్షల ఖరారులో ప్రముఖంగా వాదించిన ఎండీ బర్కత్‌అలీ, ఏపీపీ కె.రమేష్, డీసీఆర్‌బీ సీఐ బి.నరసింహారావు, పలు కేసుల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించిన అప్పటి డీఎస్పీలు కె.రవికుమార్, వై.జెస్సీ ప్రశాంతి, సీఐలు పి.సుధాకర్‌రావు, నారాయణస్వామి, వీరయ్యచౌదరి, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు, జి.సంధ్యారాణి, పోలీస్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను జిల్లా ఎస్పీ అందించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీ ఏటీవీ రవికుమార్ (ఎల్/ఓ), జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



డీఎస్పీ జెస్సీ ప్రశాంతికి ప్రశంసాపత్రం అందిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజల దృష్టి మళ్లించేందుకు అక్రమ కేసు

- వాస్తవ వీడియోను మార్ఫింగ్ అనడం సిగ్గుచేటు
- మినీ మహానాడులో కార్యకర్తలు, మీడియా సాక్షిగా చేసిన వ్యాఖ్యలవి
- అనలేదనడం పిరికిపంద చర్య
- నాపై ఫిర్యాదు చేస్తేనే మార్కెట్ యార్డు పదవి అంటూ టీడీపీ నేతకు ఎర
- ఎమ్మెల్యే నరేంద్ర అరాచకాలను గమనిస్తున్న ప్రజలు
- వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- పోలీసుస్టేషనులో విచారణకు హాజరు



విచారణకు హాజరయ్యేందుకు పోలీసు స్టేషన్‌కు వస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ చేస్తున్న హత్యా రాజకీయాలు, అరాచకాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించడం ఆనవాయితీగా మారిందని వైఎస్సార్‌సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ధ్వజమెత్తారు. రాజకీయంగా టీడీపీని వ్యతిరేకించే వారిని అణచివేయడమే లక్ష్యంగా ఎమ్మెల్యే నరేంద్ర వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మన్నవ సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావుపై ఈ నెల 3వ తేదీన జరిగిన హత్యాయత్నమే ఇందుకు నిదర్శనం అన్నారు. పట్టణ టీడీపీ నేత ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనపై నమోదైన అక్రమ కేసులో శనివారం అంబటి మురళీకృష్ణ పట్టణ పోలీసు స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. సుమారు రెండు గంటలపాటు సీఐ వీరా నాయక్ విచారించారు. అనంతరం అంబటి మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడారు.

పదవి ఆశచూపి తప్పుడు ఫిర్యాదు

రెండు నెలల క్రితం మండలంలోని చింతలపూడి గ్రామంలో మినీ మహానాడు సభలో మీడియా, వందలాది కార్యకర్తల సాక్షిగా టీడీపీ కార్యకర్తలను రెచ్చగొడుతూ అడ్డొచ్చిన వారిని భూస్థాపితం చేయాలంటూ నరేంద్ర చేసిన వ్యాఖ్యల కారణంగానే సర్పంచ్‌పై దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. హత్యాయత్నం వీడియో, నరేంద్ర చేసిన ఆవేశ పూరిత వ్యాఖ్యల వీడియోలు మీడియా సాక్షిగా రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయని వెల్లడించారు. ఎమ్మెల్యే నరేంద్ర ప్రమేయంతోనే ఈ దాడి జరిగిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్ నాగ మల్లేశ్వరరావుపై టీడీపీ గూండాల దాడిని ప్రతి ఒక్కరూ ఖండించారని తెలిపారు. అయితే దీనిలో నరేంద్ర ప్రమేయం ఉందని తెలిసి ఏ టీడీపీ నేత కూడా ఈ దాడిని ఖండించలేదని గుర్తు చేశారు.

20 రోజులుగా నియోజకవర్గంలో ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక, ప్రజల దృష్టిని మరల్చేందుకు చేసిన ప్రయత్నమే తనపై ఈ అక్రమ కేసు అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఆశ చూపి తనపై టీడీపీ పట్టణాధ్యక్షుడు అహ్మద్ ఖాన్‌తో తప్పుడు ఫిర్యాదు చేయించినట్లు స్పష్టంగా అర్థమవుతోందని విమర్శించారు. నరేంద్ర మాట్లాడిన సభలోనే ఉండి కూడా ఆయన అనలేదని, వీడియో మార్ఫింగ్ అంటూ అసత్య ఆరోపణలతో ఫిర్యాదు చేసిన అహ్మద్ ఖాన్ అల్లాహ్‌కు సమాధానం చెప్పాలని అన్నారు.

ఎస్సీ, ముస్లిం, కాపు వర్గాలను పావులుగా వాడుతున్న ఎమ్మెల్యే

నరేంద్ర చేసే కుట్రలకు ఎస్సీలు, ముస్లింలు, కాపు వర్గాలను పావులుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. మన్నవ సర్పంచ్‌పై దాడి కేసులో ఎమ్మెల్యే, ఆయన వర్గంతో పాటు నిందితులను తప్పించిన ఎస్‌ఐ కిరణ్‌పై కూడా ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ జరగనుందని అన్నారు. ఇటీవల వడ్డిముక్కల గ్రామంలో కాలం చెల్లిన సంగం పెరుగు అని ప్రశ్నించినందుకు కాపు వర్గానికి చెందిన యువకుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయించడం దుర్మార్గం అన్నారు. ఇలా అనేక అరాచకాలకు పాల్పడ్డారని, భవిష్యత్తులో అన్నింటిపై చర్యలు ఎదుర్కోక తప్పదని అన్నారు. ఈ అక్రమ కేసులో పోలీసులు 41ఏ నోటీసు ఇచ్చారని, వీడియో ఆధారంగా ఎమ్మెల్యే నరేంద్ర చేసిన వ్యాఖ్యలలో నిజం ఉందని స్పష్టం చేశారు. పొన్నూరు ప్రజల కోసం ఎలాంటి కేసులైనా తాను ఎదుర్కొంటానని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు రోళ్ల మాధవి, షేక్ సైపుల్లా, ఆకుల వెంకటేశ్వరరావు, చింతలపూడి మురళీకృష్ణ, షేక్ నాజర్, షేక్ మాము, అమిరినేని సాంబశివరావు, రుద్రపాటి ఆదిశేషు, అంబటి వెంకటేశ్వరరావు, లంకపోతు పిచ్చిరెడ్డి, షేక్ మౌలాలి ఉన్నారు .

అలరించిన గరికపాటి ప్రవచనాలు

నరసరావుపేట: స్థానిక పాతూరులోని శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక తరంగిణి, శ్రీ నాగసరపు సుబ్బరాయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వేదాంత భేరీ ప్రవచనానికి మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరై ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ట్రస్టు చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తాలు డాక్టర్ గరికపాటిని ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



డాక్టర్ గరికపాటిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, నాగసరపు గుప్తా

అమ్మ సన్నిధిలో సేవకు అవకాశం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో పండుగలు, పర్వదినాలతో పాటు రద్దీ సమయాల్లో నిస్వార్థంగా ఉచిత సేవ చేసే సేవకులు, భక్త బృందాలకు ప్రాధాన్యత ఇవ్వాలని దేవస్థానం నిర్ణయించింది. ఈ మేరకు సేవ చేయడానికి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు ఆలయ ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సుకోవాలన్నారు. సేవకు భక్తులు తమ వివరాలను www.kanakadurgamma.org లో వాలంటరీ విభాగంలో తమ పేరు, ఫోన్ నంబర్, చిరునామా, ఫొటో, ఆధార్ కార్డుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

గుంటూరు వైద్య కళాశాలలో రీసెర్చ్ జర్నల్ ఏర్పాటు

గుంటూరు మెడికల్: రాష్ట్రంలోనే పేరొందిన గుంటూరు మెడికల్ కళాశాల మరొక కీలక అడుగు ముందుకు వేసింది. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి నేతృత్వంలో ప్రఖ్యాత శాస్త్రీయ ప్రచురణ సంస్థ సైంటిఫిక్ స్కాలర్స్‌కు చెందిన పబ్లిషర్ ప్రితేష్‌తో రీసెర్చ్ జర్నల్ ఏర్పాటుకు సంబంధించి ఎంఓయూ కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిసెంబర్ నాటికి తొలి జర్నల్ సంచిక విడుదల అయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. కాలేజీ నుంచి ప్రపంచానికి ఎంతోమంది ప్రముఖ వైద్యులు వెళ్లారని, ఇప్పుడు సాంకేతిక పరిశోధనకు ప్రాధాన్యతనిచ్చే జర్నల్ ద్వారా కళాశాల ఘనతను మరింతగా పెంచతామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వైద్య పరిశోధనలను ఈ జర్నల్ ద్వారా ప్రచురించడం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు పరిశోధన పట్ల మరింత ఆసక్తిని పెంచుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, పలు విభాగాల సహాయక ఆచార్యులు పాల్గొన్నారు.




పబ్లిషర్ ప్రితేష్‌కు ఎంఓయూ పత్రం అందజేస్తున్న డాక్టర్ సుందరాచారి

మహానాడులో యువకుడు ఆత్మహత్య

- టీడీపీ నాయకుడి వల్లే తన కుమారుడు చనిపోయాడంటున్న తల్లి
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు
- ఆవేదన వ్యక్తం చేసిన కుటుంబసభ్యులు


మాట్లాడుతున్న బాజీ తల్లి మొహమ్మద్ మునీసురీసా


ఆత్మహత్య చేసుకునే ముందు బాజీ గోడపై రాసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తన మరణానికి సైదులు అనే టీడీపీ నాయకుడు కారణమంటూ ఓ యువకుడు గోడపై రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి కుటుంబ సభ్యులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి రాగా, కొడుకు మరణించాడన్న బాధలో ఉన్న వారిని అవమానించడంతో బయటకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి మొహమ్మద్ మునీసురీసా మాట్లాడుతూ.. తన కుమారుడైన ఎం.డి. బాజీ (31) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 23వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఎందుకు చనిపోయాడో తమకు తెలియక 24వ తేదీ మృతదేహాన్ని ఖననం చేశామని చెప్పారు. ఖననం అనంతరం ఇంటిని శుభ్రం చేస్తుండగా గోడమీద 'తన మరణానికి ఎస్‌డీ సైదులు, రాకేష్ కారణం అని, చంపుతామని బెదిరించారని, వారు టీడీపీ కాబట్టి ఏం చేయగలవంటూ బెదిరించినట్లు' కుమారుడు రాశాడని తెలిపారు. ఈ విషయాన్ని 25వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా ఖననం చేసి తమ దగ్గరకు వస్తే ఏమీ చేయలేమని పోలీసులు పేర్కొన్నట్లు చెప్పారు. తమ కుమారుడి చావుకు కారణం వాళ్లు ఎందుకు అవుతారని ప్రశ్నించారని తెలిపారు. గోడపై కుమారుడు రాసిన విషయాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి చూపించగా తాము కేసు కట్టబోమని, బయటకు వెళ్లాలని, ఎవరి దగ్గరకు వెళ్లినా న్యాయం జరగదని, ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కృష్ణానది ఒడ్డున తమ కుమారుడికి అన్నయ్య వరుస అయ్యే వారిని సైదులు కొట్టాడని, అప్పుడే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు వాపస్ తీసుకుంటారా లేదా అంటూ అనేకసార్లు బెదిరించారని ఆమె తెలిపారు. 23వ తేదీన కూడా సైదులు, రాకేష్‌లు కత్తి తీసుకుని చంపేస్తామని, తమది టీడీపీ అని చెప్పినట్లు ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకపోతే పోలీస్‌స్టేషన్ దగ్గర నిరాహార దీక్ష చేస్తామని ఆమెతోపాటు బాజీ కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

మిషన్ గ్రీన్ గుంటూరు లోగో డిజైన్లకు ఆహ్వానం

నెహ్రూనగర్: స్వచ్ఛ గుంటూరు – క్లీన్ గుంటూరు కాన్సెప్ట్‌లో మిషన్ గ్రీన్ గుంటూరు నినాదంతో లోగో కోసం డిజైన్లను ఆహ్వానిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ డిజైన్‌గా ఎంపికైన డిజైనర్‌కు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందిస్తామని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో వార్డులవారీగా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా డిజైన్‌లు ఆహ్వానిస్తున్నామన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్, పేరు, ఫోన్ నంబర్ తదితర వివరాలతో ఆగస్టు 15వ తేదీలోపు నగరపాలక సంస్థ వాట్సాప్ నంబర్ 98499 08391కు పంపవచ్చని తెలిపారు. ఆగస్టు 15 అనంతరం ఉత్తమ డిజైన్ ఎంపిక ఉంటుందన్నారు.

డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు సాక్ష్యాలు అందజేత


సీఐ వీరేంద్రబాబుకు సాక్ష్యాలను అందజేస్తున్న నారాయణ మూర్తి

తాడేపల్లి రూరల్: డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రజలను రెచ్చగొడుతూ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నాగ నారాయణమూర్తి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడినట్లు సీఐ సాక్ష్యాలు అడగడంతో శనివారం నారాయణమూర్తి ఆ సాక్ష్యాల వీడియో ఫుటేజీని పెన్‌డ్రైవ్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా నాగ నారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకారావు మాట్లాడుతూ... 'పవన్ కళ్యాణ్ తమ కార్యకర్తలతో చంపండి... నరకండి.. అది సివిలైజేషన్' అంటూ రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని చెప్పారు. సీఐకి సాక్ష్యాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, వి.రవీంద్రారెడ్డి, బి.నరేంద్ర సింగ్, ఎస్‌కే జావీద్ బాషా, హసన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్



గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్‌లు అన్నారు. వేతన చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ శనివారం డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ డీఏలు, పీఆర్సీపై ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల విషయంలో తాత్సారం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని పేర్కొన్నారు. రోజూ రకరకాల అప్‌లోడ్ పనులతో టీచర్లను బోధనకు దూరం చేస్తున్నారని, ఇది పరోక్షంగా ప్రభుత్వ విద్యను కాలరాయడమే అన్నారు. టీచర్లకు రకరకాల శిక్షణ ఇచ్చి బోధనను ఆటంకపరుస్తూ ఉంటే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇక నుంచైనా ఆన్‌లైన్ పనులు ఆపి అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం డీవైఈవో ఏసు రత్నంకు వినతి పత్రం సమర్పించారు. నిరసన ప్రదర్శనలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, బి.ప్రసాదు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎం. చిన్నయ్య, మండల శాఖ నాయకులతోపాటు బదిలీ అయిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎంఈవోలుగా అదనపు బాధ్యతలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మూడు మండలాలకు ఎంఈవో-1లుగా అదనపు బాధ్యతలపై నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు వెస్ట్ ఎంఈవో-1గా గుంటూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.హవీలా, పెదకాకాని ఎంఈవో-1గా గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీవీ రమణయ్య, చేబ్రోలు ఎంఈవో-1గా చేబ్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్. చలపతిరావును పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి శనివారం నియమించారు.

జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

కొరిటెపాడు (గుంటూరు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత పది రోజులుగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 63.8 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.4 మి.మీ. వర్షపాతం కురిసింది. సగటున 16.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర మండలంలో 45.4 మి.మీ., తుళ్ళూరు 28.2, తాడికొండ 25.6, మంగళగిరి 25, పెదకాకాని 20, తాడేపల్లి 19.6, గుంటూరు తూర్పు 17.6, గుంటూరు పశ్చిమ 16.2, ఫిరంగిపురం 8.2, తెనాలి 6.4, చేబ్రోలు 4, పెదనందిపాడు 3.6, కాకుమాను 3.4, మేడికొండూరు 3.4, ప్రత్తిపాడు 2.6, వట్టిచెరుకూరు మండలంలో 2.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది. జూలై 26వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 138.3 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 228.2 మి.మీ. నమోదైంది.

కారు కాలువలో పడి విద్యార్థి మృతి

అమర్తలూరు (వేమూరు) : కారు అదుపు తప్పి కాలువలో పడిన ఘటనలో జూపూడి పవన్ (18) అనే విద్యార్థి మృతి చెందాడు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఎస్‌ఐ రవితేజ కథనం మేరకు.. విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న ఏడుగురు విద్యార్థులు శనివారం అద్దెకు తీసుకున్న కారులో ఒంగోలులోని జూపూడి పవన్ ఇంటికి వెళ్లారు. తిరిగి బాపట్ల బీచ్‌కు వెళ్లి, విజయవాడ బయలు దేరారు. ఈ క్రమంలో అమర్తలూరు మండలం ప్యాపర్రు, యలవర్రు రోడ్డు వద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి కాలువలో పడి పోయింది. కారులో ఉన్న విద్యార్థులు అద్దాలు పగలు కొట్టుకొని బయటకు వచ్చారు. అప్పటికి పవన్ మృతి చెందాడు. మిగిలిన ఆరుగురికి గాయాలయ్యాయి. వీరంతా విజయవాడ నగరానికి చెందిన విద్యార్థులని ఎస్‌ఐ తెలిపారు. పవన్ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



గుంటూరు రూరల్: నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు శనివారం జూలై నెలకు సంబంధించిన శిక్షణ, సందర్శన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి లాంఫాం ఏడీఆర్ దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల ఏడీఏలు వ్యవసాయ స్థితిగతులు వివరించారు. శాస్త్రవేత్తలు పత్తి, కంది పంటల కట్ ఆఫ్ డేట్స్, వివిధ ప్రాంతాలకు అనువైన వరి రకాలు, నేరుగా విత్తన వరిలో కలుపు యాజమాన్యం, జీవన ఎరువుల వినియోగం, ఎండు తెగులును తట్టుకునే కంది రకాలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు వంటివి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంట వేయకుండా ఖాళీగా ఉంచి అనంతరం శనగ వేయదలచిన రైతులు స్వల్పకాలిక అపరాలు సాగు చేపట్టవచ్చని తెలిపారు. డీఏవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏటీఎంఏ సహకారంతో వ్యవసాయశాఖ, యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీజన్ ప్రారంభమైన సందర్భంగా విస్తరణ కార్యక్రమాలు, క్షేత్ర సందర్శనలు చేపట్టాలన్నారు. అనుకూలమైన యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఏవో శివకుమారి, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ డివిజన్ల ఏడీఏలు, కేవీకే, డాట్, ఉద్యాన, పరిశోధన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.